# జనవరిలో షురూ





**మహేశ్‌బాబు, రాజమౌళి** సినిమా అప్‌డేట్ కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులంతా ఆతృతతో ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుంది? అనే విషయంపై ఇప్పటివరకూ రకరకాల వార్తలొచ్చాయి. అయితే.. వాటిలో నిజానిజాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. తాజాగా ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి సంబంధించి విశ్వసనీయ సమాచారం అందింది. సంక్రాంతి తర్వాత ఈ సినిమా షూటింగ్‌కు రాజమౌళి కొబ్బరికాయ కొట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తయ్యాయని తెలిసింది. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీతోపాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరుగుతుందట. సంక్రాంతి తర్వాత షూటింగ్ మొదలుపెట్టి, ఏప్రిల్ వరకూ చిత్రీకరణ జరపుతారని సమాచారం. తర్వాతి షెడ్యూల్ విదేశాలలో ఉంటుందట. ఈ సినిమా అధికారిక ప్రకటనకు సంబంధించిన గ్లింప్స్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలో ఇతర నటీనటుల్ని కూడా పరిచయం చేసే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతున్నది. అనవాయితీ ప్రకారం త్వరలోనే ఓ ప్రెస్‌మీట్‌ను కూడా రాజమౌళి పెట్టనున్నారట. వెయ్యికోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మాత కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్నారు.



# ‘స్పిరిట్’లో మృణాల్?

అరంగేట్రం చేసిన అనతికాలంలోనే తెలుగులో మంచి గుర్తింపును సంపాదించుకుంది మరాఠీ భామ మృణల్ ఠాకూర్. సీతారామం, హాయ్ నాన్న చిత్రాల్లో ఈ భామ అభినయానికి ప్రశంసలు లభించాయి. ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ హిందీ సినిమాలపై ఎక్కువ దృష్టి పెట్టింది. అక్కడ నాలుగు ప్రాజెక్ట్స్‌లో నటిస్తూ బిజీగా ఉంది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ తెలుగులో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. ప్రభాస్ ‘స్పిరిట్’ చిత్రంలో ఆమె కథానాయికగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. సందీప్‌రెడ్డి వంగా డైరెక్ట్ చేయబోతున్న ‘స్పిరిట్’ మూవీ ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ‘యానిమల్’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా ఇదే కావడంతో భారీ అంచనాలేర్పడ్డాయి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. జనవరిలో షూటింగ్ మొదలుకానున్నట్లు సమాచారం. ఈ సినిమాలో కథానాయికగా మృణాల్ ఠాకూర్ ఖరారయ్యే అవకాశాలున్నాయని ముంబయి సినీ సర్కిల్స్‌లో వార్తలొస్తున్నాయి. ఇదే గనుక నిజమైతే మృణాల్ ఠాకూర్ కెరీర్‌లోనే ఇదే అతిపెద్ద ఆఫర్ అవుతుందని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.



# స్వల్పంగా గాయపడ్డ ప్రభాస్

అగ్రకథానాయకుడు ప్రభాస్ స్వల్పంగా గాయపడ్డారు. సినిమా షూటింగ్‌లో భాగంగా ఆయన కాలికి గాయమైనట్టు తెలుస్తున్నది. ప్రస్తుతం ఆయన డాక్టర్ల సలహా మేరకు విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా ఈ ఏడాది విడుదలైన బ్లాక్‌బస్టర్ ‘కల్కి 2898ఏడీ’ సినిమా.. వచ్చే ఏడాది జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఆయన పాల్గొనాల్సివుంది. కానీ అనుకోకుండా ఆయన గాయపడటంతో జపాన్‌లో జరిగే కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నారు. ఈ విషయాన్ని తన సోషల్‌మీడియా ద్వారా అభిమానులకు తెలియజేస్తూ ఓ పోస్ట్ పెట్టారు. ‘నాపై మీరు చూపిస్తున్న ప్రేమాభిమానానికి ధన్యవాదాలు. మూవీ షూటింగ్‌లో కాలికి గాయం అయ్యింది. అందుకే జపాన్లో జరిగే కార్యక్రమానికి రాలేకపోతున్నాను. జపాన్‌లోని అభిమానులను ఎప్పట్నుంచో కలవాలనుకుంటున్నా. కానీ కుదర్లేదు.. క్షమించండి..’ అంటూ పోస్ట్ ద్వారా స్పందించారు ప్రభాస్.

# ఈ ఏడాది ఎగసిన నవ దర్శక కెరటాలు

**తెలుగు సినిమా గమనాన్ని గమనిస్తే.. ప్రతి మలుపులోనూ ఓ కొత్త దర్శకుడు కనిపిస్తాడు. ట్రెండ్ సెట్ చేసిన సినిమాలన్నీ దాదాపుగా కొత్త దర్శకులవే. న్యూ బ్లడ్.. న్యూ థింకింగ్.. న్యూ మేకింగ్.. వీటితో ఎప్పటికప్పుడు సినిమా మేకోవర్ అవుతూ ఉంటుంది. ఈ ఏడాది విశేషమేంటంటే.. ఎప్పటిలాగే సక్సెస్ పర్సంటేజ్ తక్కువ.. వాటిలో కొత్త దర్శకులు సాధించిన విజయాలు ఎక్కువ. సినిమాలైతే రెండొందలకు పైనే విడుదలయ్యాయి. విజయాలు మాత్రం పాతికలోపే. వాటిలో ఎనిమిది సినిమాలు కొత్త దర్శకులవే కావడం విశేషం. అవి కూడా ఒకదానిదో ఒకటి సంబంధం లేని భిన్నమైన కాన్సెప్టులు కావడం మరో విశేషం. అవేంటో ఓ లుక్కేద్దాం.**

**ఈ ఏడాది సక్సెస్** అందుకున్న తొలి డెబ్యూ డైరెక్టర్ విజయ్ బిన్నీ. సినిమా ‘నా సామిరంగ’. నాగార్జున లాంటి టాప్ స్టార్‌ని తొలి ప్రయత్నంలోనే డైరెక్ట్ చేయడమంటే సామాన్యమైన విషయం కాదు. నాగ్‌తోపాటు అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ కూడా ఇందులో నటించారు. ముగ్గురు హీరోలతో అసలుసిసలైన సంక్రాంతి సినిమా తీసి మంచి విజయాన్ని అందుకున్నాడు విజయ్ బిన్నీ. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న మాస్ ఎంటర్టైనర్ ఇది. అందుకే ఓ వైపు సంక్రాంతి బరిలో విడుదలై.. ‘హను-మాన్’ అదరగొట్టేస్తున్నా.. ‘నా సామిరంగ’ మాత్రం తెలుగు స్టేట్స్‌లో డీసెంట్ హిట్‌గా నిలిచింది. చిట్టూరి శ్రీనివాస్ ఈ సినిమాకు నిర్మాత.

**ఫిబ్రవరిలో విడుదలైన** ‘అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్’ సినిమా ద్వారా దుష్యంత్ కటికనేని దర్శకుడిగా పరిచయం అయ్యాడు. సుహాస్ కథానాయకుడిగా రూపొందిన ఈ చిత్రం అసమానతల నేపథ్యంతో కూడిన రూరల్ ప్రేమ కథ. ఓ వైపు అందమైన ప్రేమకథను చూపిస్తూ.. మరోవైపు సామాజిక అంశాలను కూడా చర్చించాడు దర్శకుడు దుష్యంత్. హీరో సుహాస్‌కీ, కథానాయికగా పరిచయమైన శివానీకీ, కీలక పాత్ర పోషించిన శరణ్య ప్రదీప్‌కీ ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెట్టింది. విమర్శకుల ప్రశంసలతో పాటు వాణిజ్యపరంగా కూడా సినిమా బాగా ఆడింది. ధీరజ్ మొగిలినేని, వెంకట్‌రెడ్డి కలిసి ఈ సినిమాను నిర్మించారు.

**మార్చిలో విడుదలైన** విశ్వక్‌సేన్ అడ్వెంచర్ థ్రిల్లర్ ‘గామి’ ఓ మంచి ప్రయోగం. ఈ సినిమా ద్వారా విధ్యాధర్ కాగిత దర్శకుడిగా పరిచయం అయ్యాడు. ఓ అఘోరా సాహస యాత్రే ఈ సినిమా. దర్శకుడిగా తొలి అడుగు ఈ తరహా కథతో వేయడం నిజంగా సాహసమే. అసలు హీరో విశ్వక్‌సేన్‌ను ఇలాంటి పాత్రలో ఎవరూ ఊహించరు. కీలక పాత్ర పోషించిన ఛాందినీ చౌదరికి కూడా ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెట్టింది. కథ, మేకింగ్ పరంగా ఈ సినిమా పలువురి ప్రశంసలందుకుంది. దర్శకుడిగా విధ్యాధర్‌కి కూడా మంచి మార్కులే పడ్డాయి. కార్తీక్ శబరీష్ ఈ చిత్రానికి నిర్మాత.

**జూన్‌లో విడుదలైన** ‘మ్యూజిక్ షాప్ మూర్తి’ ఓ వినూత్నమైన స్నేహం కథ. శివ పాలడుగు దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కుటుంబం కోసం పెద్దాయనకీ, సరిగ్గా అలాంటి పరిస్థితుల్లోకే నెట్టివేయబడుతున్న ఓ అమ్మాయికీ మధ్య జరిగిన కథే ఇది. ఇందులో పెద్ద స్టార్లు లేకపోవడంతో థియేటర్లలో సినిమా సరిగ్గా ఆడలేదు. కానీ ఓటీటీలో మాత్రం జనం బాగా చూశారు. దర్శకుడిగా శివ పాలడుగుకీ, ప్రధాన పాత్రలు పోషించిన అజయ్ ఘోష్, ఛాందినీ చౌదరిలకు ఈ సినిమా మంచి పేరు తెచ్చిపెట్టింది. హర్ష గారపాటి, రంగారావు గారపాటి సినిమాకు నిర్మాతలు.

**ఆగస్ట్ నెలలో** రెండు సినిమాలు విడుదలయ్యాయి. వాటిలో ఒకటి ‘కమిటీ కుర్రోళ్లు’ కాగా, రెండో సినిమా ‘ఆయ్’. రెండూ గోదావరి జిల్లాల నేపథ్యంతో కూడిన కథలే కావడం విశేషం. ఈ రెండు సినిమాల ద్వారా ఇద్దరు కొత్త దర్శకులు వెండితెరకు పరిచయం అయ్యారు. వారిలో ఒకరు యదు వంశీ. ఇతని దర్శకత్వంలో వచ్చిన ‘కమిటీ కుర్రోళ్లు’ ఓ అద్భుతమైన జ్ఞాపకం లాంటి సినిమా. కోనసీమ అందాలు, అక్కడి సంప్రదాయాలు, నమ్మకాలు, ప్రేమలు, స్నేహాలు.. ఈ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. వాణిజ్యపరంగా పెద్ద విజయాన్నే అందుకుందీ సినిమా. అంతేకాదు, చాలామంది కొత్త నటీనటులు ఈ సినిమా ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. కొణిదెల నిహారిక ఈ సినిమాకు సమర్పకురాలు కావడం విశేషం. పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక కలిసి ఈ సినిమాను నిర్మించారు.

**ఇక ‘ఆయ్’ విషయానికొస్తే..** ఈ సినిమా ద్వారా అంజి కె.మణిపుత్ర దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఇది ఓ విభిన్నమైన ప్రేమ కథ. ప్రేమకు కులం అడ్డంకిగా మారితే పరిస్థితేంటి? అనేదే ఈ సినిమా కథ. కోనసీమ అందాలు, అక్కడి మనస్తత్వాలు, పంతాలు, పట్టింపులు నేపథ్యంలో ఆసక్తిగా, అంతకు మించి కామెడీగా ఈ సినిమా సాగింది. ఇది కూడా కమర్షియల్‌గా మంచి హిట్టే. ఇందులో హీరోహీరోయిన్లుగా చేసిన నార్నె నితిన్, నయన్ సారిక కెరీర్‌లకు ఈ సినిమా మంచి బ్రేక్. బన్నీవాసు, విద్య కొప్పినీడి ఈ చిత్రానికి నిర్మాతలు.

**ఈ ఏడాది సెప్టెంబర్‌లో** వచ్చిన మంచి సినిమా ‘35 చిన్న కథకాదు’. పేరు తగ్గట్టే ఇది చిన్న కథ కాదు.. గొప్ప కథ. అమీర్‌ఖాన్ ‘తారే జమీన్ పర్’ సినిమాతో పోల్చదగ్గ కథ ఇది. విద్యావ్యవస్థలోని లోపాల్ని ఎత్తి చూపుతూ.. పిల్లల అభ్యున్నతిలో తల్లిదండ్రుల పాత్రను తెలియజెప్పే గొప్ప కథతో దర్శకుడు నందకిశోర్ ఈమని ఈ సినిమాను తెరకెక్కించాడు. తొలి ప్రయత్నంగా గొప్ప కథ రాసుకొని, అంతేగొప్పగా తెరకెక్కించి పలువురి ప్రశంసలందుకున్నారు నందకిశోర్. తిరుపతిలోని ఓ సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జరిగే కథ ఇది. రెండున్నర గంటలపాటు ప్రేక్షకుల్ని కూడా తిరుపతిలో కూర్చోబెట్టాడు దర్శకుడు నందకిశోర్. నివేత థామస్ అభినయం ఈ సినిమాకు ప్రధానబలం. అలాగే ప్రియదర్శి, అరుణ్‌దేవ్ పోతుల కూడా చక్కగా అభినయించారు. వాణిజ్యపరంగా కూడా ఈ సినిమా బాగా ఆడింది. శృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మాతలు.

**ఇక ఈ ఏడాదిలో** ముఖ్యంగా చెప్పుకోవాల్సిన సినిమా ‘‘క’’. కొత్తగా ఆలోచిస్తే, ఆ ఆలోచనను అద్భుతంగా తెరకెక్కిస్తే.. అది చిన్న సినిమా అయినా.. పెద్ద విజయం ఖాయమని నిరూపించిన సినిమా ఇది. ఈ సినిమా ద్వారా సుజీత్-సందీప్ దర్శకులుగా పరిచయం అయ్యారు. ఇద్దరు కలిసి ఓ చిత్రాన్ని డైరెక్ట్ చేయడం తెలుగు తెరపై ఇదే ప్రథమం. కర్మసిద్ధాంతం చుట్టూ తిరిగే కథ ఇది. కథను చివరి దాకా నడిపించిన తీరు అద్భుతమైతే.. చివరికి ఈ దర్శకులిద్దరూ ఇచ్చిన ట్విస్ట్ మహాద్భుతం. పిరియాడిక్ కథాంశం కావడంతో ఓ కొత్త వాతావరణాన్ని తెరపై చూపించడంలో దర్శకులిద్దరూ సక్సెస్ అయ్యారు. అలాగే.. ఇందులో హీరోగా చేసిన కిరణ్ అబ్బవరం నటుడిగా ఓ మెట్టు పెకెక్కాడు. అలాగే కథానాయికలు నయన్ సారిక, తన్వీరామ్‌లకు కూడా ఈ సినిమా మంచి బ్రేక్. ఈ ఏడాది వచ్చిన బెస్ట్ మూవీస్‌లో ‘క’ ఒకటి అని నిక్కచ్చిగా చెప్పొచ్చు. చింతా గోపాల కృష్ణారెడ్డి ఈ చిత్రానికి నిర్మాత.

**చివరిగా చెప్పొచ్చేదేంటంటే.. ఎంతమంది దర్శకులు పరిచయం అయ్యారు అనేది ముఖ్యంకాదు. ఎంతమంది సక్సెస్ సాధించారు అనేది ఇక్కడ ముఖ్యం. ఆ విధంగా చూసుకుంటే ఈ ఏడాది వచ్చిన విజయాలలో సగం కొత్తవారివే. ఏదేమైనా.. ద్వితీయ విఘ్నాన్ని అధిగమించడమే ఇక్కడ అసలైన పరీక్ష. పరిశ్రమలో గట్టి పునాది రెండో విజయంతోనే పడేది. మరి తొలి ప్రయత్నంలో విజయాలను అందుకున్న వీరిలో ద్వితీయవిఘ్నాన్ని అధిగమించేది ఎందరో చూడాలి.**





# ప్రేమికుల రోజున

యువ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం ‘లైలా’. రామ్‌నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని షైన్‌స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. ఈ చిత్రాన్ని వాలైంటైన్ డేను పురస్కరించుకొని ఫిబ్రవరి 14న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో విశ్వక్‌సేన్ ట్రెండీ లుక్స్‌తో కనిపిస్తున్నారు. ఈ సినిమాలోకి కొన్ని ఎపిసోడ్స్‌లో విశ్వక్‌సేన్ అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు. ఇందుకోసం ఆయన స్పెషల్ మేకోవర్‌కు సిద్ధమయ్యారని, లేడీ గెటప్‌లోకి సన్నివేశాలు చక్కటి హాస్యాన్ని పండిస్తాయని చిత్రబృందం పేర్కొంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతున్నది. జనవరి 1న ఫస్ట్‌లుక్‌ను విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్‌ప్రసాద్, సంగీతం: లియోన్ జేమ్స్, దర్శకత్వం: రామ్ నారాయణ్.



# పోరాటయోధుడు కిరాట

మంచు విష్ణు కథానాయకుడిగా తెరకెక్కుతున్న భక్తిరస ప్రధాన చిత్రం ‘కన్నప్ప’. శ్రీకాళహస్తి స్థల పురాణం ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. ముఖేష్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ఈ సినిమా నుంచి మోహన్‌లాల్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన కిరాట అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఫస్ట్‌లుక్‌లో మోహన్‌లాల్ గంభీరంగా కనిపిస్తున్నారు. పోరాట యోధుడిగా కిరాట పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. విజువల్ వండర్‌గా ఆధ్యాత్మిక, భక్తి ప్రధాన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు.

# కష్టానికి తగిన ప్రతిఫలం దక్కింది

వేదిక ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ ‘ఫియర్’. డా.హరిత గోగినేని దర్శకత్వంలో డా.వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ‘ఇది హారర్‌తో కూడుకున్న సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్. సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాను 16రోజుల్లో పూర్తి చేశాం. సినిమా మొదలైన ఏడు నెలల్లో ఫస్ట్ కాపీ రెడీ చేశాం. ఆ తర్వాత ఇంటర్నేషనల్ అవార్డులకు అప్లై చేస్తే.. 39 ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో 70కి పైగా అవార్డులొచ్చాయి. ఇంత తక్కువ సమయంలో ఇంత బాగా సినిమా చేయగలిగామంటే కారణం ఆర్టిస్టులు, టెక్నీషియన్సే. ఉన్న బడ్జెట్‌లో క్వాలిటీగా సినిమా చేశాం. పడిన కష్టానికి తగిన ప్రతిఫలం వచ్చినందుకు సంతోషంగా ఉంది’ అని డైరెక్టర్ డా.హరిత గోగినేని చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.





# బీచ్ హత్యల వెనక..

వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్’. రైటర్ మోహన్ దర్శకుడు. వెన్నెపూస రమణా రెడ్డి నిర్మాత. ఈ నెల 25న విడుదలకానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారుతుంది. ఆ తర్వాత బీచ్‌లో వరుసగా హత్యలు జరుగుతుంటాయి. వీటిని ఛేదించడంలో పోలీసులు విఫలమవడంతో శ్రీకాకుళం షెర్లాక్‌హోమ్స్ అనే ప్రైవేట్ డిటెక్టివ్‌కు బాధ్యతలను అప్పగిస్తారు. గ్రామంలోని ప్రేమజంట సహాయంతో అతను హత్యా రహస్యాలను ఎలా బయటపెట్టాడనే అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా మారింది. కేసును ఛేదించే క్రమంలో వెన్నెల కిషోర్ కనబరచిన తెలివితేటలు, సెన్సాఫ్ హ్యూమర్ ఆకట్టుకునేలా ఉన్నాయి. నిర్మాత వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. అనన్య నాగళ్ల, సీయా గౌతమ్, స్నేహగుప్తా, రవితేజ మహద్యం, బాహుబలి ప్రభాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, నిర్మాణ సంస్థ: శ్రీ గణపతి సినిమాస్, రచన-దర్శకత్వం: రైటర్ మోహన్.

# సైకలాజికల్ కల్కిని చూస్తారు..



‘ఇరవైఏళ్ల క్రితం నేను చేసిన సినిమాలను గుర్తుపెట్టుకొని ఇంకా నన్ను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. ఇది రెగ్యులర్ సినిమా కాదు. ఓ కొత్త అనుభూతికి లోనుచేసే ఊహా ప్రపంచం లాంటి సినిమా. టెక్నీషియన్స్ అందరూ నా విజన్‌కి సహకరించారు. రేష్మా అద్భుతంగా నటించింది. రీసెంట్‌గా సినిమా చూసినప్పుడు కన్నడ ఒరిజినలా? తెలుగు ఒరిజినలా? అనే డౌట్ వచ్చింది. అంత అద్భుతంగా అనువాదం కుదిరింది. మీరు మైథలాజికల్ ‘కల్కి’ చూశారు. ఇందులో సైకలాజికల్ కల్కిని చూస్తారు. ఈ సినిమాను అల్లు అరవింద్ తెలుగులో విడుదల చేస్తున్నారు.’ అని తెలిపారు నటుడు, దర్శకుడు ఉపేంద్ర. ఆయన స్వీయ దర్శకత్వంలో నటించిన చిత్రం ‘UI’. జి.మనోహరన్, కె.పి.శ్రీకాంత్ నిర్మాతలు. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఉపేంద్ర మాట్లాడారు. అతిథులుగా విచ్చేసిన దర్శకుడు బుచ్చిబాబు, నిర్మాతలు అంబికా రామచంద్రరావు, ఎస్‌కేఎన్‌లు చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.